

మోకిలలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తామని అధికారులు ఏర్పాటు చేసిన బ్యానర్


నమస్తే తెలంగాణ

# రంగారెడ్డి

I హైదరాబాద్, శనివారం 3 మే 2025 RANGAREDDY




ఇబ్రహీంపట్నం : దండుమైలారం కొనుగోలు కేంద్రం వద్ద ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతులు



శంకర్‌పల్లి మండలంలోని మోకిలలో ఇంకా ప్రారంభం కాని కొనుగోలు కేంద్రం

# గింజా కొనలే..

## ఎక్కడి ధాన్యం అక్కడే..

- వరి కోతలు ప్రారంభమైనా ఇంకా షురూ కాని కొనుగోలు కేంద్రాలు
- దిక్కుతోచని స్థితిలో అన్నదాతలు
- ఆరబోసేందుకు సరిపడా కల్లాల్లేక.. అకాల వర్షాల భయంతో తక్కువ ధరకు విక్రయిస్తూ.. నష్టాల పాలు
- వేధిస్తున్న గన్నీ సంచుల కొరత
- గత కేసీఆర్ ప్రభుత్వమే నయమంటున్న అన్నదాతలు
- అధికారులు స్పందించాలని విజ్ఞప్తి

యాసంగి వరి కోతలు ప్రారంభమైనా ప్రభుత్వం ఇప్పటివరకు ధాన్యం కొనుగోలు కేంద్రాలను షురూ చేయకపో వడంతో అన్నదాతలు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. సరిపడా కల్లాలు లేక వచ్చిన ధాన్యాన్ని ఎక్కడ నిల్వ చేయలో తెలియక.. అకాల వర్షాల భయంతో దళారులకు తక్కువ ధరకు అమ్ముతూ నష్టాల పాలు అవుతున్నారు. గత కేసీఆర్ ప్రభుత్వం పంటల కోతల సమయంలోనే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోగా.. ప్రస్తుత సర్కార్ రైతులను పట్టించుకోకపోవడంతో వారి బాధలు వర్ణనాతీతంగా మారాయి.

**- న్యూస్‌నెట్‌వర్క్, నమస్తే తెలంగాణ**

### తెరుచుకోని కేంద్రాలు..

షాబాద్, మే 2 : షాబాద్ మండలంలోని సర్దార్‌నగర్, శంకర్‌పల్లి మండలంలోని మోకిల గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాల్సి ఉండగా ఇప్పటికీ ప్రారంభమే కాలేదు. కోతలు మొదలుపెట్టి 15 రోజులు దాటుతున్నా కేంద్రాలు లేకపోవడంతో ఆరుగాలం కష్టించి పండించిన పంటను ఎక్కడ అమ్ముకోవాలో తెలియని దిక్కుతోచని స్థితిలో అన్నదాతలున్నారు. మోకిలలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తామని బ్యానర్ ఏర్పాటు చేసిన అధికారులు ఇప్పటివరకూ ఒక్క గింజనూ కొనలేదు. ప్రస్తుతం అక్కడ ఎవరూ అందుబాటులో ఉండడం లేదు. సర్దార్‌నగర్‌లో కేంద్రం ఏర్పాటుపై ఇప్పటికీ స్పష్టత లేదని, తమకు ఎలాంటి ఆదేశాలు రాలేవని అధికారులు సెలవిస్తున్నారు.

### తరుగు పేరిట రైతన్న నిలువుదోపిడీ



ఆమనగల్లు వ్యవసాయ మార్కెట్ యార్డులో తూకం వేసిన ధాన్యాన్ని డీసీఎంలో లోడ్ చేస్తున్న కూలీలు

ఆమనగల్లు : ధాన్యాన్ని విక్రయించేందుకు కడ్తాల్, తలకొండపల్లి మండలాల్లో రేవంత్ సర్కార్ ఇప్పటికీ కొనుగోలు కేంద్రాలనే ప్రారంభించలేదు. ఆమనగల్లు, మాడ్గుల మండలాల్లో మాత్రం ఒక్కో కేంద్రాన్ని చొప్పున ప్రారంభించింది. ఆమనగల్లు మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో తలకొండపల్లి పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏప్రిల్ 18న కొనుగోలు కేంద్రాన్ని షురూ చేసినా ధాన్యం సేకరణ మాత్రం గత నెల 24 నుంచి ప్రారంభం కాగా ఇప్పటివరకు 1190( 2,975 సంచులు)(1 సంచి 40 కిలోలు) క్వింటాళ్ల సన్న రకం, దొడ్డురకం 1510 క్వింటాళ్లు (3777 సంచులు) కొన్నట్లు సిబ్బంది తెలిపారు. తరుగు పేరిట క్వింటాల్‌కు 4 కిలోలు కట్ చేస్తున్నట్లు రైతులు వాపో తున్నారు. దాంతోపాటు క్వింటాల్‌కు రూ.50 హమాలీ చార్జి తీసుకుంటూ అన్నదాతను నిలువు దోపిడీ చేస్తున్నారు.

#### తరుగు తక్కువగా తీయాలి..



ఆరుగాలం కష్టించి పండించిన పంటను విక్రయించేందుకు కొనుగోలు కేంద్రానికి తీసుకొస్తే క్వింటాల్‌కు 4 కిలోల చొప్పున తరుగు తీయడం తగదు. ఈ విధంగా అన్నదాతను నిలువు దోపిడీ చేయొద్దు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

**-కేతావత్ డాక్యా (వాసుదేవ్‌పూర్)**

#### నిలువు దోపిడీ చేస్తున్నారు..



పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకెళ్తే తరుగు పేరిట క్వింటాల్‌కు 4 కిలోల చొప్పున కట్ చేయడంతోపాటు హమాలీలు 1 క్వింటాల్‌కు రూ.50 వసూలు చేస్తూ మరల ముట్టి పేరిట హమాలీలు, పని చేస్తున్న మహిళలు రైతుల దగ్గర ధాన్యం తీసుకుంటున్నారు. ఇది సరైన విధానం కాదు . రైతులను ఇలా నట్టేట ముంచడం తగదు.

**-ఉప్పల యాదయ్య (జంగారెడ్డిపల్లి )**

#### ఐదు రోజులుగా తూకం వేయడం లేదు.



ధాన్యాన్ని విక్రయించేందుకు ఆదివారం వ్యవసాయ మార్కెట్ యార్డుకు తీసుకొచ్చా. తేమ పేరుతో ఐదు రోజులుగా తూకం వేయడం లేదు. 1 క్వింటాల్‌కు 4 కిలోల చొప్పున తరుగు తీస్తామని సిబ్బంది చెబుతున్నారు. ఇలా తరుగు తీయడం రైతులకు మోసం చేయడమే.

**-తాళ్ల యాదమ్మ (సంకటోనిపల్లి )**

#### గన్నీ బ్యాగుల కొరతతోనే..



మండలంలో ఇంకా కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాలేదు. గన్నీ బ్యాగులు అందుబాటులో లేకపోవడంతోనే పీఏసీఎస్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించ లేదు. డిమాండ్‌కు తగ్గట్టు గన్నీ బ్యాగులను పంపాలని ఉన్నతాధికారులకు సమాచారమందించాం. రెండు, మూడు రోజుల్లో కొనుగోళ్లను ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

**-గంప వెంకటేశ్‌గుప్తా, పీఏసీఎస్ చైర్మన్, కడ్తాల్ మండలం**

### కల్లాల్లోనే ధాన్యం.. ఆందోళనలో రైతన్న

ఇబ్రహీంపట్నం : ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో వరి కోతలు ప్రారంభమై దాదాపు నెల రోజులవుతున్నది. పది రోజుల కిందట డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం, దండుమైలారం, మంచాల, బోడకొండ, యాచారం, మంతన్‌గౌరెల్లి, నందివనపర్తి, చింతపట్ల, తొర్రూరు, గౌరెల్లి గ్రామాల్లో 10 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించగా..కేవలం దండుమైలారం, తొర్రూరు కొనుగోలు కేంద్రాల్లో తూకాలు ప్రారంభమయ్యాయి. మిగిలిన ఎనిమిది కొనుగోలు కేంద్రాల్లో నేటికీ గింజ ధాన్యాన్ని కూడా కొనకపోవడం విడ్డూరంగా ఉన్నదని అన్నదాతలు మండిపడుతున్నారు. సరిపడా కల్లాల్లేక.. రోడ్లపై ఆరబోసిన ధాన్యం సాయంత్రం సమయంలో కురుస్తున్న అకాల వర్షాలతో తడిసి పోతున్నదని.. అందుకే తక్కువ ధరకే దళారులకు పంటను విక్రయిస్తూ నష్టపోతున్నట్లు పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దండుమైలారం, తొర్రూరు కొనుగోలు కేంద్రాల్లో గన్నీ బ్యాగుల సమస్య రైతులను వేధిస్తున్నదని.. అధికారులు స్పందించి సంచులను అందుబాటులో ఉంచి త్వరగా ధాన్యాన్ని సేకరించాలని కోరుతున్నారు.

#### నెలరోజులు దాటినా కొంటలేరు..



పంట కోసి నెల రోజులు దాటుతున్నది. బోడకొండ వద్ద పది రోజుల కిందట కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసినా ఇప్పటివరకు గింజా ధాన్యాన్ని కూడా కొనలేదు. త్వరగా ధాన్యాన్ని కొనుగోలు చేయాలని అధికారులను అడిగితే లేబర్ కొరత కారణంగా కొనడంలేదని చెబుతున్నారు. ప్రతిరోజూ ధాన్యాన్ని ఆరబోస్తున్నాం. సాయంత్రం కాగానే అకాల వర్షం కురిసి ధాన్యం తడిసిపోతుంది. మా బాధ ఎవరికీ చెప్పుకోవాలో అర్థం కావడంలేదు. అధికారులు స్పందించి వెంటనే కొనాలి.

**-రమావత్ నడ్జా, కొర్రవానితండా**

#### కాంగ్రెస్ వచ్చినంక అన్నీ కష్టాలే..



ఉదయమే కల్లాల్లోకి వెళ్లి ధాన్యాన్ని ఆరబెడుతున్నాం. ఎండలో ఉండడంతో జ్వరాలు వస్తున్నాయి. రాత్రి దవాఖానకెళ్తే వందల రూపాయలు ఖర్చు అవుతున్నది. ఇంకా ఎన్ని రోజులు ధాన్యాన్ని ఆరబెడుతూ ఉండాలి. అధికారులు స్పందించి కొనుగోలు కేంద్రాలను ఓపెన్ చేయాలి. కేసీఆర్ సారు ఉండగా ఇంత ఇబ్బంది పెట్టలేదు. ఎప్పుడు పంట వస్తే అప్పుడు ధాన్యం కొని, వెంటనే డబ్బులు బ్యాంకు ఖాతాల్లో జమ చేశాడు. ఈ కాంగ్రెస్ వచ్చాక మాకు అన్నీ కష్టాలే వచ్చాయి.

**-జాటోతు నాను, బోడకొండ**

#### గన్నీ బ్యాగులు సమకూర్చాలి



గన్నీ బ్యాగుల కొరతతో కొనుగోలు కేంద్రంలో ధాన్యం సేకరణ నిలిచిపోయింది. మూడు రోజుల నుంచి గన్నీ బ్యాగులు వస్తున్నాయని అధికారులు చెబుతున్నారు. కానీ, అవి రావడంలేదు. దీంతో అక్కడ ధాన్యం రాశులు నిండిపోతున్నారు. అధికారులు స్పందించి త్వరగా కొనుగోలు జరిగేలా చూడాలి.

**-లింగం, దండుమైలారం**

#### కేసీఆర్ సార్ ఉన్నప్పుడే బాగుండే..



కేసీఆర్ సార్ ఉన్నప్పుడు ధాన్యం కొనే సమయానికంటే ముందే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసేవారు. ఈ రేవంత్ సర్కారు వచ్చినంక అన్నదాతలకు అన్నీ కష్టాలే. నెలరోజులుగా ధాన్యం కల్లంలోనే ఉంటున్నది. అధికారులు స్పందించి వెంటనే ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించాలి.

**-రమావత్ కోక్యానాయక్, కొర్రవానితండా**

### ప్రచారం లేక బోసిపోయిన కేంద్రం

షాద్‌నగర్, మే 2 : షాద్‌నగర్ నియోజకవర్గంలోని ఫరూఖ్‌నగర్, కొందుర్గు, చౌదరిగూడ మండలాలకు కలిపి షాద్‌నగర్ వ్యవసాయ మార్కెట్ యార్డులో కొనుగోలు కేంద్రాన్ని గత నెల 29న ఏర్పాటు చేశారు. ఈ కేంద్రం ఏర్పాటైన విషయం సమీప గ్రామాల రైతులకు తెలియదు. ఇక్కడ ధాన్యం కొనుగోలు కేంద్రం ఉన్నట్లు అధికారులు అవగాహన కల్పించడంలో పూర్తిగా విఫలమ య్యారు. అంతేకాకుండా ఈ కేంద్రం ఉదయం 11 గంటల దాటినా తెరుచుకోవడంలేదని రైతులు వాపోతున్నారు. తేమను పరీక్షించే మిషన్, తూకం పరి కరాలు, నాణ్యతా ప్రమాణాలపై అవగాహన కల్పించే సిబ్బంది లేకపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. 1500 బస్తాలు, సుమారు 600 క్వింటాళ్ల ధాన్యాన్ని మాత్రమే సేకరించినట్లు సమాచారం.



షాద్‌నగర్ వ్యవసాయ మార్కెట్‌లో వడ్ల కొనుగోలు కేంద్రం.. రైతన్నలకు ఇక్కడ సెంటర్ ఉన్నట్లు తెలియకపోవడంతో ఇలా ..

#### కొనుగోలు కేంద్రంలోని సిబ్బంది పట్టించుకోవడంలేదు..



తేమను చెక్ చేసేందుకు కొన్ని వడ్లను కొనుగోలు కేంద్రానికి తీసుకురాగా.. వాటిని అక్కడి సిబ్బంది చూడనేలేదు. మిషన్ లేదని చెబుతున్నారు. ఆ యంత్రం ఎప్పుడు వస్తుందని అడిగితే తమకు తెలియదంటున్నారు. ఎవరినీ అడగాలో తెలియడం లేదు. ఇలాంటి సమస్యలు ఉంటాయనే చాలామంది రైతులు మధ్యదళారులకు తక్కువ ధరకు విక్రయిస్తూ నష్టాల పాలు అవుతున్నారు.

**- జగన్, రైతు, గంట్లవెల్లి, ఫరూఖ్‌నగర్ మండలం**

#### రూ. 1900-రూ.2000 ధర వస్తున్నది..



ఇక్కడ కొనుగోలు కేంద్రం ఉన్నట్లు తెలియదు. అయినా ఆ కేంద్రంలో ధాన్యాన్ని విక్రయిస్తే సమయానికి డబ్బులు రావు. ఆ డబ్బులు వచ్చే వరకు కూలీలు, ట్రాక్టర్, అప్పిచ్చిన వారు ఆగరుకాదా.. వానకాలంలో అమ్మిన రైతులకే ఇప్పటికీ బోనస్ పైసలు రాలేదని అంటుండ్రు. ఇవన్నీ తిప్పలు ఎందుకని మార్కెట్‌లో వ్యాపారికి విక్రయిస్తున్నా. అక్కడ క్వింటాకు రూ. 1900 నుంచి రూ. 2000 ధర వస్తుంది. దీంతో అక్కడే చాలామంది విక్రయిస్తున్నారు.

**- తౌర్యా, రైతు, హేమాజీపూర్**

---

### భూముల కోసం

# దాడులకు తెగబడుతూ..

- భూవివాదాలకు కేంద్రంగా మారుతున్న శివారు ప్రాంతాలు
- తలెత్తుతున్న శాంతిభద్రతల సమస్య
- గత నెల రోజుల వ్యవధిలో మూడు ఘటనలు..

రంగారెడ్డి, మే 2 (నమస్తే తెలంగాణ) : హైదరాబాద్ శివారులో విస్తరించి ఉన్న జిల్లాలో భూతగాదాలు పెరుగుతున్నాయి. భూముల కోసం వైరి వర్గాలు ప్రాణాలను తీస్తుండడంతో శాంతిభద్రతల సమస్య తలెత్తి పోలీసులకు సవాల్‌గా మారుతున్నది. భూతగాదాల నేపథ్యంలో రౌడీలు, గూండాలు రంగంలోకి దిగి భయానక వాతావరణాన్ని సృష్టిస్తున్నారు. గత నెల రోజుల వ్యవధిలో తుర్కయాంజాల్, కమ్మగూడ, కొహెడ తదితర గ్రామాల్లో వరుసగా భూతగాదాలు జరిగి శాంతిభద్రతల సమస్య తలెత్తింది. జిల్లా శివారు ప్రాంతాల్లో భూముల ధరలు విపరీతంగా పెరిగాయి. కాగా, కొంతమంది రెవెన్యూ రికార్డులను తమకు అనుకూలంగా మార్చుకుంటూ ఈ సమస్యకు కారణమవుతున్నారు. పైసా ... పైసా కూడబెట్టుకుని శివారు ప్రాంతాల్లో ప్లాట్లు కొన్న యజమానులు తమ ప్లాట్లు దక్కడంలేదన్న బాధతో లబోదిబోమంటున్నారు. ఇలాంటి ఘటనలు శివారు ప్రాంతాల్లో రోజుకోటి వెలుగులోకి వస్తున్నాయి. హయత్‌నగర్ మండలంలోని కొహెడ గ్రామంలో బుధవారం జరిగిన ఘటన తీవ్ర కలకలం సృష్టించింది. పోలీసుల సమక్షంలోనే కర్రలు, కత్తులు, రాళ్లతో ఇరువర్గాల వారు పరస్పరం దాడులు చేసుకున్నారు.

తుర్కయాంజాల్ మున్సిపాలిటీ పరిధిలో గత పదిహేను రోజుల కిందట సర్వేనంబర్ 250, 251, 254లో ప్లాట్ల యజమానులు, భూయజమానులకు మధ్య తలెత్తిన రాళ్ల దాడి మరువకముందే బుధవారం కొహెడలో మరో ఘటన చోటుచేసుకున్నది. తుర్కయాంజాల్‌లోని సర్వేనంబర్ 140, 141, 142లో భూయజమాని తన స్థలాన్ని ప్లాట్లుగా చేసి విక్రయించాడు. కాగా, ఆ భూమి తనదంటూ రాజమ్మ అనే మహిళ కోర్టును ఆశ్రయించగా.. న్యాయస్థానం ఆమెనే హక్కుదారు అంటూ తీర్పు ఇచ్చింది. దీంతో ఆమె ఆ భూమిని మరో ఇద్దరు వ్యక్తులకు జీపీఏ చేసింది. దీంతో జీపీఏదారులు నగరం నుంచి పెద్ద ఎత్తున అనుచరులతో ఆ స్థలం వద్దకు వెళ్లగా ప్లాట్ల యజమానులకు వారికి మధ్య తీవ్రస్థాయిలో ఘర్షణలో జరిగింది. ఇందులో పలువురు గాయపడడమే కాక పలు వాహనాలూ దగ్ధమయ్యాయి. ఈ భూమి విషయంలో శాంతిభద్రతల సమస్య తలెత్తుతున్నదని.. కోర్టు తీర్పు వచ్చే వరకు ఈ స్థలంలోకి ఎవరూ వెళ్లొద్దంటూ పోలీసులు నిషేధాజ్ఞలు విధించారు. కాగా, ఈ ఘటన మరువకముందే కొహెడలోని సర్వేనంబర్ 951, 952లో ప్లాట్ల యజమానులకు బాల్‌రెడ్డి అనే మరో వ్యక్తికి మధ్య బుధవారం తీవ్రస్థాయిలో ఘర్షణ జరిగింది. ఈ స్థలంలో గతంలో ప్లాట్లు చేయగా కొంతమంది వాటిని కొన్నారు. అయితే, బాల్‌రెడ్డి అనే వ్యక్తి ఈ ప్లాట్లకు సంబంధించిన స్థలం తనదేనని అక్కడ ఫామ్‌హౌస్ నిర్మించాడు. ప్లాట్ల యజమానులు హైడ్రా అధికారులను ఆశ్రయించగా.. వారు కాంపౌండ్‌వాల్‌ను కూల్చివేశారు. కూల్చివేసిన కాంపౌండ్‌వాల్ పరిధిలో ప్లాట్ల యజమానులు స్థలాన్ని చదును చేసేందుకు వెళ్లగా బాల్‌రెడ్డి కుటుంబ సభ్యులకు వారికి మధ్య గొడవ జరిగింది. కత్తులు, రాళ్లతో దాడులకు పాల్పడ్డారు. పోలీసుల ముందే కత్తులతో స్వైరవిహారం చేశారు. హయత్‌నగర్ పోలీసులు రంగంలోకి దిగి ఘటనకు బాధ్యులైన వారిపై కేసులు నమోదు చేశారు. అలాగే, కమ్మగూడ గ్రామంలో సర్వేనంబర్ 213, 214లో భూయజమానులకు, పక్కనే ఉన్న కాలనీవాసులకు మధ్య కొంతకాలంగా బాట వివాదం ఉన్నది. కాలనీలోకి వెళ్లకుండా రోడ్డుకు అడ్డంగా కాంపౌండ్‌వాల్ నిర్మించారని కాలనీవాసులు హైడ్రాను ఆశ్రయించారు. హైడ్రా అధికారులు ప్రహరీని కూల్చివేయగా.. భూయజమాని మరోమారు హైకోర్టును ఆశ్రయించాడు. అలాగే, పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ పరిధిలోని కుంట్లూరు గ్రామంలో గుడిసెవాసులకు, భూయజమానులకు మధ్య కొంత కాలంగా వివాదం సాగుతున్నది. దీంతో ఈ ప్రాంతంలో ఎప్పుడు శాంతిభద్రతల సమస్య తలెత్తుతుందో తెలియని పరిస్థితి నెలకొన్నది.



కొహెడలో జరిగిన ప్లాట్ల ఘర్షణలో గాయపడిన ఓ వ్యక్తి



రాయితో దాడి చేస్తున్న వ్యక్తి (ఫైల్)

పోలీసులకు సవాల్‌గా మారింది.

#### తలెత్తుతున్న శాంతిభద్రతల సమస్య

శివారు ప్రాంతాల్లోని ఠాణాల్లో ప్రతిరోజూ ప్లాట్లు, భూములకు సంబంధించిన వివాదాలు పెరిగిపోతుండడంతో శాంతిభద్రతల సమస్య ఏర్పడుతున్నది. భూవివాదాల్లో పోలీసులు తలదూర్చవద్దని ఓ వైపు ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేస్తున్నా శాంతిభద్రతల సమస్య దృష్ట్యా పోలీసుల జోక్యం తప్పనిసరి అవుతున్నది.

#### లబోదిబోమంటున్న ప్లాట్ల యజమానులు..

పైసా...పైసా కూడబెట్టి శివారు ప్రాంతాల్లోని వెంచర్లలో పేదలు, మధ్యతరగతి ప్రజలు ప్లాట్లను కొంటున్నారు. కొంతకాలం తర్వాత ఆ భూములు తమకే చెందుతాయంటూ మరి కొందరు కోర్టులను ఆశ్రయించి స్టే ఆర్డర్లు తెచ్చుకుంటున్నారు. దీంతో తాము కొనుగోలు చేసిన ప్లాట్లు వివాదంలో ఉండడంతో ప్లాట్ల యజమానులు లబోదిబోమంటున్నారు. ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని రాందాస్‌పల్లి, ఆదిబట్ల, మంగల్‌పల్లి తదితర గ్రామాల్లో వెంచర్లలో ప్లాట్లు కొనుగోలు చేసిన వారి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. రియల్‌ఎస్టేట్ వ్యాపారులు ప్లాట్లు చేసి విక్రయించి బయటపడుతున్నారు. వాటిని కొన్న వారు ఇబ్బందుల్లో పడుతున్నారు.

### క్రీడా ప్రాంగణాల అద్దెల్లో గోల్‌మాల్

సిటీబ్యూరో, మే 2 (నమస్తే తెలంగాణ): జీహెచ్‌ఎంసీ క్రీడా ప్రాంగణాలపై ప్రైవేట్ వ్యక్తులు దందా చేస్తున్న అంశాన్ని యంత్రాంగం సీరియస్‌గా తీసుకున్నది. జోనల్ కమిషనర్ స్థాయిలో నెలవారీ అద్దె చొప్పున క్రీడా ప్రాంగణాలకు తీసుకుని కొందరు జీహెచ్‌ఎంసీకి నామమాత్రపు ఫీజులు చెల్లిస్తూ బయట వ్యక్తుల నుంచి భారీ మొత్తంలో వసూలు చేస్తూ అక్రమ సంపాదనకు కేంద్రంగా మార్చుకుంటున్నట్లు ఫిర్యాదులు అందాయి. జూబ్లీహిల్స్ వార్డు కార్యాలయం వెనుక ఓ ప్రైవేట్ వ్యక్తి దందా వెలుగులోకి రావడంతో ఈ తరహా వ్యవహారాలపై స్టాండింగ్ కమిటీ సమావేశంలో మేయర్ అధికారులను నిలదీశారు. లోపాలను సరిదిద్ది తక్షణమే నూతన కేటాయింపులు ఏమైనా స్టాండింగ్ కమిటీ ముందుకు తీసుకురావాలని ఆదేశించారు. దీంతో జోనల్ కమిషనర్ నుంచి ప్రధాన కార్యాలయానికి క్రీడా ప్రాంగణాల కేటాయింపు ప్రతిపాదన చేరనున్నది. స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఆమోదం పొందిన తర్వాతే టెండర్ ప్రక్రియ ద్వారా కేటాయింపులు చేయనున్నారు.

### 'ఎర్లీబర్డ్' వసూలు.. రూ.900.93 కోట్లు

సిటీబ్యూరో, మే 2 (నమస్తే తెలంగాణ ) : ఎర్లీ బర్డ్ పథకంలో భాగంగా జీహెచ్‌ఎంసీకి రూ.900.93 కోట్ల ఆస్తి పన్ను వసూలైనట్లు అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. గతేడాది రూ. 831.23 కోట్లు వసూలు కాగా, ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.900.93 కోట్ల సమకూరిందన్నారు. ఎర్లీబర్డ్ పథకాన్ని 7,93,552 మంది వినియోగించుకున్నారని వివరించారు. అన్ని విభాగాల సమష్టి కృషితోనే రికార్డు స్థాయిలో ఆస్తిపన్ను వసూలు అయినట్లు తెలిపారు.